మూర్తిరెడ్డిని అభినందించిన మంత్రి సురేష్



మూర్తి రెడ్డికి స్వీటు తినిపిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఏఎంసీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డిని శనివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి అభినందించారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రభుత్వం చేపట్టి అమలు పరుస్తున్న నవరత్నాల పథకాల గురించి ప్రజలకు వివరించాలని, సూచించి అందరికీ స్వీట్లు తినిపించారు. మూర్తిరెడ్డి, మంత్రి సురేష్‌కు శాలువకప్పి సన్మానించారు. పదవి రావటానికి కృషి చేసిన మంత్రి సురేష్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం .బాలగురవయ్య, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, డీలర్స్ అసోషియోషన్ మండల అధ్యక్షుడు షేక్.కాశింపీరా, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, డి.శ్రీనివాసరెడ్డి, షేక్ వలి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 26 సీట్లు భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. వివరాలకు 85007 23716ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏకి గాయాలు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని తూర్పు గంగవరంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామ వీఆర్ఏ కొమ్ము దావీదుకు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై దర్శి రోడ్డు నుంచి వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది.

ప్రత్యేక అలంకారంలో బాలా త్రిపురసుందరీ దేవి

త్రిపురాంతకం: శ్రీబాలా త్రిపురసుందరీ దేవి అమ్మవారు.. శ్రావణ మాసం సందర్భంగా శనివారం ప్రత్యేకంగా గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వీహెచ్‌పీ మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో నగరోత్సవం నిర్వహించారు.


పూజలు చేస్తున్న భక్తజనం

దర్శి డివిజన్‌కు రూ.36 లక్షల మంజూరు

దొనకొండ: వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం కింద దర్శి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దొనకొండ మండలాలకు రూ.9 లక్షల చొప్పున మొత్తం రూ.36 లక్షలు మంజూరు అయినట్లు దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ తెలిపారు. ఆరవల్లిపాడు గ్రామంలోని శ్రీవెంకటేశ్వర రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో గ్రూపు సభ్యులతో శనివారం మాట్లాడారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గిద్దలూరు రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దేవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సాయి చైతన్య డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం పలు సూచనలు చేశారు.

బాబాకు ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలో సాయిబాబా ఆలయ 33వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్రపటానికి గ్రామోత్సవం జరిపించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

దర్శి (కురిచేడు): మండలంలోని తూర్పు వీరాయపాలెం ఎంపీయూపీ పాఠశాలలో శనివారం రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, మ్యాపులు పంపిణీ చేశారు. బహుజన రచయిత, తూర్పు వీరాయపాలెం ఎంపీయూపీ పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న అట్లూరి రామారావు తండ్రి నాగయ్య వర్ధంతి సందర్భంగా అందించారు. అట్లూరి రామారావు కుమారుడు సుష్మానంద్ సమకూర్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేసిన దృశ్యం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశినాయన నగర్‌లో గల కాశిరెడ్డి కుంట అభివృద్ధి కోసం శనివారం నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య శంకుస్థాపన చేశారు. కుంటలో పూడిక తీత, కుంట చుట్టు వాకింగ్ ట్రాక్, వంటి పనుల కోసం రూ.53 లక్షలను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కమిషనర్ వై.రామక్రిష్ణయ్య, వైస్‌చైర్మన్ ఆర్.డి.రామక్రిష్ణ, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పొదిలి-2 సచివాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని రెండో సచివాలయాన్ని తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి, ఉద్యోగుల హాజరు పరిస్థితిపై ఆరా తీశారు. సమస్యలపై వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. సాంకేతిక సమస్యలు తలెత్తినపుడు నిపుణుల సలహాలు తీసుకుని పనులు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు, వీఆర్‌ఓలు మురళి, యాకోబు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ముండ్లమూరు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని దర్శి సీఐ రామకోటయ్య అన్నారు. నోయాక్సిడెంట్ డే సందర్భంగా పెద ఉల్లగల్లు వద్ద దర్శి - అద్దంకి ప్రధాన రహదారిలో వాహనదారులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో స్థానిక ఎస్సై మహేష్ శనివారం వాహనదారులకు రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పించారు. పోలీసులకు సహకరించి వాహనాలను నడపాలని సూచించారు.

వాహనదారులకు జరిమానా

పుల్లలచెరువు: వాహన దారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్ఐ శ్రీహరి అన్నారు. శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. పత్రాలు లేనివాహనాలకు జరిమానాలు విధించినట్లు తెలిపారు.

శ్రీవారికి శ్రావణమాసం పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రేగడపల్లిలో వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను వెండి కిరీటాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా భక్తులు పూజల్లో పాల్గొన్నారు.